నీటి దందా!

వాల్టా చట్టానికి తూట్లు

● లక్షలు దండుకుంటున్న అక్రమ వాటర్ ప్లాంట్ల యజమానులు ● చర్యలు తీసుకున్నా తెల్లారే నీటి దందా మళ్లీ షురూ



మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలో అనుమతులు లేకుండా అక్రమంగా నీటిని తరలిస్తున్న వాటర్ ట్యాంకులు, ప్లాంట్

మోతీనగర్: వేసవి కాలం ప్రారంభం కావడంతో ఇప్పటికే నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా లో–ప్రెషర్ కారణంగా ట్యాంకర్లను కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. వాల్టా చట్టం నిబంధనలకు విరుద్ధంగా మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి టాకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు.

◆ అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్, సున్నం చెరువు పరిసరాల్లో అనధికారికంగా బోర్లను వేసి నీటిని విక్రయించటంతో పాటు మైసమ్మ చెరువు, సున్నం చెరువులలో భూమి నుంచి పైపులను వేసి ఎవరికి కనిపించకుండా నీటిని తోడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. సమీప నివాసితులు బోర్లు వేసినా నీరు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని అరికట్టాల్సిన సంబంధిత అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో సుమారు 100 బోర్లు వేసి వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి కలుషితమైన నీటిని ఎక్కువ సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని అనారోగ్యాల పాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

◆ అంతేకాకుండా ఆ ప్రాంతం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండల పరిధిలో ఉండటంతో ఒకరిపై ఒకరు తమ పరిధి కాదని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో అక్రమ నీటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. తూతూ మంత్రంగా అధికారులు వచ్చి రెండు మూడు బోర్లను తొలగించి మమ అంటూ చేతులు దులుపుకుంటున్నారు. దీనికి తోడు గాయత్రినగర్, పద్మావతినగర్, మేరాజ్‌నగర్, అజీజ్ నగర్ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది వీటన్నిటికి కారణం అక్రమ నీటి వ్యాపారమే.

◆ సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంటుంది. ఇటీవల స్వాక్షాత్తూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్రమ వాటర్ ప్లాంట్లతో పాటు టాంకర్లను సీజ్ చేసిన విషయం విదితమే. సీజ్ చేసిన నాలుగు రోజులకే అక్రమ నీటి వ్యాపారులు అధికారుల ఆదేశాలను పాటించకుండా తిరిగి యథావిధిగా నీటి సరఫరాను యతేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

◆ ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేసవి కాలంలో అక్రమ నీటి వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు, అక్రమంగా ప్రభుత్వ స్థలాల్లో బోర్లు వేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

◆ ప్రతి సంవత్సరం వేసవికాలం వచ్చిందంటే అక్రమ నీటి వ్యాపారులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. ఇదే అదనుగా భావించి ఇష్టానుసారంగా బోర్లు వేస్తుండటంతో సంవత్సరం, సంవత్సరానికి మరిన్ని బోర్లు పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు. ఇప్పటికైనా అక్రమ బోర్లు వేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.









ఇంద్రాహిల్స్‌లో రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం



ఇంద్రాహిల్స్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని ఇంద్రాహిల్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గతంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. గురువారం సీసీ రోడ్డు నిర్మాణం జరుగనున్న ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ సీసీరోడ్డును మొదలు పెట్టి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే పాదచారులు, వాహనదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సాఫీగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత రామకృష్ణగౌడ్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, వెంకట్‌నాయక్, ఎం.రాజు, యాదగిరి, పద్మయ్య, అనిమేష్, కళ్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ బీజేపీ కార్యాలయం ఆవరణలో ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఆయన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోర్చా సెక్రటరీ పూజారాం, ఉపాధ్యక్షులు రవికుమార్‌యాదవ్, కోశాధికారి రాజారాం, మహిళా మోర్చా అధ్యక్షుడుగా కొత్తపల్లి విజయగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీకాంత్‌చారిలను నియమించి, నియామకపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డివిజన్ సెక్రటరీ బొంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

కాంగ్రెస్ నేత సిందం శ్రీకాంత్



భాగ్యనగర్‌కాలనీ: ఇటీవల జరుగుతున బీఆర్‌ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఈసారి ఎండాకాలం నీళ్ల లేకపోతే ప్రజలకు కేసీఆర్ గుర్తుకు వస్తాడని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిందం శ్రీకాంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ కృంగినప్పుడు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో బ్యారేజ్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని తెలిపారు. డిజైనింగ్, ప్లానింగ్‌లో తేడాలు ఉన్నాయని.. నాణ్యత సరిగ్గా లేదని, నిర్వహణలో లోపాల వల్ల బ్యారేజ్ పిల్లర్లు కృంగిపోయాయని నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ కేటీఆర్ మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో సైతం నాణ్యత, మెయింటెనెన్స్‌లో లోపాలు ఉన్నాయని నాలుగు సార్లు నోటీసులు ఇచ్చినా ప్రాజెక్టు అథారిటీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఈ చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు. ఇప్పటి నుంచైనా బీఆర్‌ఎస్ నాయకులు బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించాలని సూచించారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ ధర్మారెడ్డి ఫేజ్–2లో ఆలయ సముదాయ కమిటీ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ చింత సర్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకు గణపతి పూజ, పునఃపూజ, హోమం, పరియజ్ఞకరణం, యంత్ర ప్రతిష్ఠ, కళా ఆవాహన, మూల విరాట్ అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, విశిష్ట అతిథులుగా కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పట్లోల్ల నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మందలపు సాయిబాబు చౌదరి, పి.శ్యామలరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ, వ్యవస్థాపక కమిటీ సభ్యులు బొంపల్లి మధుసూదన్‌గుప్తా, కళా రమేష్, ఎం. నరసింహారెడ్డి, చీకోటి దయాకర్ గుప్తా, పుట్టా బద్రినాద్ గుప్త, చదరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట వాటర్ ప్రూఫ్ కాంట్రాక్టర్స్ నూతన కార్యవర్గం

మోతీనగర్: సమాజ సేవతో పాటు వ్యాపారం చేయటానికి వాటర్ ప్రూఫ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చాంపియన్ క్లబ్‌ను ఏర్పాటు చేశామని అధ్యక్షుడు వీరన్న తెలిపారు. గురువారం మోతీనగర్‌లో మూసాపేట వాటర్ ప్రూఫ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చాంపియన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ... నేడు సమాజంలో జరుగుతున్న పలు అంశాల పట్ల యూనియన్ పోరాడుతుందన్నారు. సమాజసేవ చేయడానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

రక్తదానం చేసిన 70మంది



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్వింకిల్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. గురువారం టాకింగ్ బ్రిక్స్ ఆవరణలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ దుర్గాదేవి, మేనేజింగ్ డైరెక్టర్ గోపినాథ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంస్థ ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధులు, చిన్నారులకు చేయూతను అందిస్తామన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం, వైద్యశాలల్లో రోగులకు సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో 70మంది రక్తదానం చేశారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశామని తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి యత్నం

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో దొంగతన యత్నం జరిగింది. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బుధవారం రాత్రి ఎప్పటిలాగానే ఉద్యోగులు విధులు ముగించుకొని ఆఫీస్‌కి తాళం వేసి వెళ్లారు. ఉదయం ఆఫీస్‌కి వచ్చిన సమయంలో రికార్డు రూం తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆఫీస్‌లోకి చొరబడి రికార్డు రూంతాళాలు పగులగొట్టి ఉండవచ్చు. ఇప్పటి వరకు ఎలాంటి రికార్డ్ పోయినట్లుగా గుర్తించలేదు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆర్.సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఫ్యాబ్రిక్ స్టూడియో ప్రారంభం

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నూతన వైకే డిజైనర్స్ ఫ్యాబ్రిక్ స్టూడియోను గురువారం ప్రముఖ యాంకర్ రవి, జబర్దస్త్ రాకింగ్ రాకేష్, సుజాత ప్రారంభించారు. వివాహాలు, ఇతర శుభకార్యక్రమాలకు డిజైనర్ దుస్తులకు చాలా డిమాండ్ ఉందని స్టూడియో ప్రతినిధులు యశ్వంత్, కౌసల్య తెలిపారు.

స్ఫూర్తిదాయకం

లక్డీకాపూల్: వాసవి ఫౌండేషన్ సామాజిక స్పృహతో ప్రజాహిత కార్యక్రమాలను చేపడుతున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు అభిషేక్ చంద, సౌమ్య చంద పేర్కొన్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌తో కలిసి నిర్వహించిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ విజయవంతం అయిందన్నారు. తమ ఫౌండేషన్ మానవ జీవితాలను పరిరక్షించడమే ప్రామాణికంగా రక్తదాన శిబిరాలను విస్తృతపర్చనున్నట్టు తెలిపారు. ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారికి కొత్త జీవితాలను అందించాలన్న కృతనిశ్చయంతో వాసవి ఫౌండేషన్ ఉందన్నారు.

నోటిఫికేషన్ విడుదల... నిరుద్యోగుల సంబరాలు

మోతీనగర్: ఎన్నో రోజుల నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సందర్భంగా గురువారం మోతీనగర్‌లో నిరుద్యోగులు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు కాసుల మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ లేక ఎన్నో అవస్థలకు గురయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వివిధ రకాల ఉద్యోగాలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయటంతో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలపై ఆశాభావం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ వెలువడటంతో నిరుద్యోగులందరూ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విశాల్, రాహుల్, శశి, శివ, నరేష్, నజీర్, భాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, స్టేషనరీ అందజేత



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శ్రీఅల్లూరి సీతారామరాజు జ్ఞాపకార్థం క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో 10వ తరగతి 92 మంది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్నులను గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు సాయికుమార్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ... 10వ తరగతి విద్యార్థుల జీవితానికి మూలస్తంభం లాంటిదన్నారు. పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

3డీ ప్రింటింగ్ మిషిన్‌పై సెమినార్

బాలానగర్: జేఎన్‌టీయూలో గురువారం డైరెక్టరేట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ స్టార్టప్‌లు ఆధ్వర్యంలో 3డీ ప్రింటింగ్ మిషిన్ పనితీరు విధానంపై ట్రెనింగ్, అవగాహనపై ఒక్కరోజు సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, రీసెర్చ్ విద్యార్థులు, యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ విద్యార్థులు దాదాపు 65 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ ఆర్. శ్రీదేవి, ప్రొఫెసర్‌లు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ఆధునిక సౌకర్యాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్వకాలం ఏదైనా పరికరం తయారు చేయాలంటే చాలా శ్రమ, అనేక వస్తువులు వృథాకావటం జరిగేదన్నారు. ఇప్పుడు ఆ విధంగా కాకుండా ఆధునిక పరికరాలు అయిన 3డీ మిషిన్ వల్ల ఎంతో సులభంగా మనం అనుకున్న విధానం, పరికరాలను తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో మోడల్‌లు తయారు చేయవచ్చన్నారు. అదే విధంగా నేడు పూర్వ విద్యార్థుల ద్వారా కొత్త సాంకేతిక పరికరాలను సమకూర్చుకోవచ్చని అన్నారు. 3డీ మిషిన్ వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. మెకానికల్ రంగంలో కూడా మనం ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఇటువంటి వర్క్‌షాపులు నిర్వహించటం మంచి ఆలోచన అని కితాబిచ్చారు. విద్యార్థుల్లో మంచి ఆలోచన, కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు.

కేపీహెచ్‌బీలో సదరన్ ట్రావెల్స్ ప్రారంభం



సదరన్ ట్రావెల్స్‌ను ప్రారంభిస్తున్న సౌత్ రీజినల్ మేనేజర్ తన్వీర్ అహ్మద్, డైరెక్టర్‌లు

కూకట్‌పల్లి: టూరిజం, హాస్పిటాలిటి సేవలను అందిస్తూ, పాన్ ఇండియా శాఖలను కలిగి ఉన్న ప్రముఖ సంస్థ అయిన సదరన్ ట్రావెల్స్ బ్రాంచ్‌ను కేపీహెచ్‌బీకాలనీ మూడవ ఫేజులో గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి సౌత్ రీజినల్ మేనేజర్ తన్వీర్ అహ్మద్, మేనేజింగ్ డైరెక్టర్‌లు ఆలపాటి కృష్ణమోహన్, ఆలపాటి వెంకట ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ దివ్య ఆలపాటి, కార్తిక్ జైన్, ఆపరేషన్స్ డైరెక్టర్ రామారావు మగులూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరన్ ట్రావెల్స్ హైదరాబాద్ ప్రజల సౌకర్యార్థం అన్ని ప్రయాణ, పర్యాటక అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించామన్నారు. సదరన్ ట్రావెల్స్ ద్వారా యూరప్, దుబయ్, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పాటు అనేక అంతర్జాతీయ ప్రయాణ అవసరాలను తీర్చుతోందన్నారు.

సందడిగా రాజ్‌భవన్ స్కూల్ వార్షికోత్సవం

● తొలి ప్రయాణం కవితా సంపుటి భేష్
● సినీ నటుడు సంపూర్ణేష్ బాబు

పంజగుట్ట: పదవ తరగతి విద్యార్థిని కుమ్మరి అనురాధ తొలి ప్రయాణం అనే కవితా సంపుటిని రాయడం హర్షణీయమని సినీ నటుడు సంపూర్ణేష్ బాబు అన్నారు. రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు, క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నటులు సంపూర్ణేష్ బాబు, అప్సర ఆజాద్, సాయి కృష్ణ, అలివ్ స్వీట్స్ సంస్థల డైరెక్టర్ దొరై స్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్నంగా భువన విజయం మాదిరి 'కవన విజయం' నిర్వహించారు. నన్నయ నుంచి దాశరథి వరకు ప్రముఖ కవుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. చక్కటి కవితలు, పద్యాలు, పాటలు, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయలు, 9కిపైగా జీపీఏ సాధించిన విద్యార్థులకు రెండు వేలు బహుమతి ఇస్తానని దొరై స్వామి ప్రోత్సహించారు. 10వ తరగతిలోనే అనూరాధ తొలి ప్రయాణం అనే కవితా సంపుటిని రాయడం ఎంతో అభినందనీయమని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఆరుగురి అరెస్టు

పంజగుట్ట: చెడు అలవాట్లకు బానిసై, మద్యం మత్తులో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... చాంద్రాయణగుట్ట, ఎల్లమ్మబండ ప్రాంతాలకు చెందిన దుధాని బాధుర్ సింగ్, టేకు నవీన్, గురుదర్ సింగ్ అలియాస్ గురుదేవ్ సింగ్, సయ్యద్ గౌస్ పాషా, షేక్ అల్తాఫ్ అలియాస్ మస్తాన్, మోదేమ్ తుల్జారామ్‌లు స్నేహితులు. వీరంతా చెడు అలవాట్లకు బానిసై త్వరగా డబ్బు సంపాదించేందుకు నేరాలకు పాల్పడుతుంటారు. వీరు ఫిబ్రవరి 25న అందరూ కలిసి డబ్బులు వేసుకుని మద్యం తాగారు. మద్యం తాగిన తర్వాత సయ్యద్ గౌస్ పాషాకు చెందిన ఆటోలో బయలు దేరారు. తెల్లవారు జామున 3:30 ప్రాంతంలో ఎర్రమంజిల్ జీవీకే మాల్ పక్కలైన్ నుండి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి, వెనక ఓ యువతి ద్విచక్ర వాహనంపై వెళ్లడం గమనించారు. అతన్ని అడ్డుకుని అతనిపై దాడిచేసి కత్తిచూపించి డబ్బులు లాక్కునేందుకు, మెడలో బంగారు గొలుసు లాక్కునేందుకు యత్నించారు. అతని ఫోన్ కింద పడిపోగానే నిందితులు ఫోన్ లాక్కుని ఆటోలో పరారయ్యారు. బాధితుడు లంగర్‌హౌస్‌కు చెందిన నరేష్ కుమార్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంజగుట్ట క్రైమ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మాజీ హెల్త్ డైరెక్టర్ అక్రమాలపై విచారణ జరిపించాలి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గత హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు వలంటరీ రిటైర్డ్‌మెంట్ అంగీకరించకుండా అతను చేసిన అక్రమాలపై విచారణ చేసి దోచుకున్న సొమ్మును జప్తు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యూనియన్ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, దళిత, మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ మాదిగ, బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్.కె.ప్రసన్న మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆయన బీఆర్‌ఎస్ కార్యకర్తలా పనిచేశారని ఆరోపించారు.

ప్రొ. డా. యాదయ్య ఉద్యోగ విరమణ



ప్రొ. డా. ఎస్.యాదయ్యను సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

బాలానగర్: జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ డిపార్టుమెంట్ సీనియర్ ప్రొఫెసర్ డా. ఎస్.యాదయ్య గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వీసీ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... డాక్టర్ యాదయ్య ప్రతిభ గల వ్యక్తి, సమయపాలన తెలిసిన వ్యక్తి, విచక్షణతో వ్యవహరించడం, సమస్యను ముందే పసిగట్టి దాన్ని సులువగా పరిష్కరించే మార్గం చూపగల మంచి పరిపాలన అధికారి అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మెంబర్‌గా ఎన్నిక కావటం వారి పరిపాలన దక్షతకు నిదర్శనమని కొనియాడారు. రెక్టార్ డా. కె. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదయ్య విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి వారితో కొత్త ఆవిష్కరణలు చేయించేవారన్నారు. ఈ కార్యక్రమంలో పలు డిపార్టుమెంట్‌ల సిబ్బంది యాదయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు.